క్లుప్తంగా

పోలీసుల అదుపులో కాపర్‌వైర్ దొంగలు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు కోకో కోలా కంపెనీలో కాపర్ వైర్లు చోరీకి పాల్పడిన దొంగలు మంగళగిరి రూరల్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి రోడ్డు వెంబడి గల కోకో కోలా కంపెనీలోకి గతనెల 25న రాత్రి సమయంలో గుర్తుతెలియని యువకులు చొరబడి కాపర్ వైర్లను దొంగిలించారు. ఈ మేరకు కోకో కోలా కంపెనీ సెక్యూరిటీ ఏఎస్ఓ ఆళ్ల శ్రీధర్ ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 100 మీటర్ల కాపర్ వైర్ అపహరణకు గురైందని, దాని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళగిరి పట్టణంలోని గండాలయ పేటకు చెందిన పలువురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దుగ్గిరాల: తెనాలి-విజయవాడ ప్రధాన రహదారిలో చింతలపూడి వద్ద సోమవారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు వేగంగా వెళ్లడంతో వాహనం అదుపు తప్పింది. దీంతో వాహనం చెట్లకొమ్ముల్లో ఇరుక్కుపోయింది. ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108 సహాయంతో తెనాలి వైద్యశాలకు తరలించారు.

భాగ్యరాజుకు ఘన నివాళులు

తాడేపల్లి రూరల్: సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు సంస్మరణ సభను సోమవారం ఉండవల్లిలో ఏర్పాటు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, డివిజన్ కార్యదర్శి ఎం.రవి భాగ్యరాజుకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. మంగళగిరి రూరల్ నవులూరులో నివాసం ఉండే భాగ్యరాజు రాజధాని 29 గ్రామాల్లో ప్రజా సమస్యలపై ఎంతో చురుకుగా పనిచేశారని గుర్తుచేశారు. ఆయన అకాల మరణం సీపీఎం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. రాజధానిలో ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటికి తలొగ్గకుండా టిడ్కో లబ్ధిదారుల నుంచి, పారిశుద్ధ్య కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. ఈనెల 7వ తేదీ రాజధాని గ్రామమైన నిడమర్రులో సంతాన సభ నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు నవీన్ ప్రకాష్, బక్కిరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, సుందరరావు పాల్గొన్నారు.

బాణసంచా నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

మంగళగిరి టౌన్: బాణసంచా నిర్వాహకులు తప్పని సరిగా కఠినమైన భద్రతా ప్రమాణాలను పాటించాలని మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై గుంటూరు జిల్లా పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళగిరి మండల పరిధిలోని పలు బాణసంచా దుకాణాలలో సోమవారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్ ఆర్ వై జంక్షన్ వద్ద గల బాణసంచా దుకాణం, ఆత్మకూరులోని మరో దుకాణాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. బాణసంచా విక్రయదారులు, నిర్వాహకులు తప్పని సరిగా లైసెన్స్ పొందిన కేంద్రాల నుంచి విక్రయాలు జరపాలని పేర్కొన్నారు. అనుమతికి మించిన నిల్వ ఉంచరాదని.. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ పేలుడు పదార్థాల నియంత్రణ నిబంధనలను అనుసరించాలని ఆదేశించారు. గోదాముల్లో పరిమితికి మించి నిల్వలు ఉండరాదని హెచ్చరించారు. నివాసాలకు దూరంగా సురక్షిత ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పనిచేసే వారికి కూడా భద్రతా పరికరాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి రూరల్ సీఐ అవ్వారు వెంకట బ్రహ్మం, ఎస్ఐ సీహెచ్ వెంకట్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ఇక్కట్లు!

రాత్రి మట్టితవ్వకాలు నిర్వహించడంతో రోడ్డుపై నల్లమట్టి పడి బురదగా మారిన రోడ్డు; రోడ్డుపై వదిలివేసిన నల్లమట్టి

- నల్లమట్టి తరలింపుతో రోడ్లు అస్థవ్యస్తం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారులు ఆటోకు ఎక్కువ, ట్రాక్టర్ ప్రయాణిస్తే తక్కువ అన్నట్లు ఉన్నాయి. ఆ రహదారుల్లో రాజధాని నుంచి తరలించే నల్లమట్టిని తీసుకువచ్చి పలుచోట్ల ఖాళీ ప్లాట్లలో నింపుతున్నారు. ఈ సమయంలో పలు రహదారులు, పక్కనే ఉన్న డ్రైన్లతో పాటుగా పూర్తిగా పాడైపోతున్నాయి. ఉండవల్లి సెంటర్ నుంచి ఉండవల్లి హరిజన వాడ కరకట్ట వరకు, అటు గుంటూరు ఛానల్ వైపు ఖాళీగా ఉన్న ప్లాట్లలో రాత్రి సమయాల్లో నల్లమట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. లారీ వెళ్లే రహదారి లేకపోయినా ఏదో విధంగా తిప్పలు పడుతూ ఆ ఖాళీ ప్లాట్లలోకి మట్టి తోలడంతో డ్రైన్‌లు సైతం పాడైపోతున్నాయి.

దెబ్బతింటున్న రోడ్లు..

ఉండవల్లి హిందూ శ్మశాన వాటిక రోడ్డులో నుంచి ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ వరకు ఇటీవల రాత్రి సమయంలో రెండు రోజుల పాటు నల్లమట్టి తోలడంతో అంతంత మాత్రంగా ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. కచ్చడ్రైన్లు పూడుకుపోయి మురుగు రోడ్డు మీదకు వస్తోంది. ఉండవల్లి సెంటర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి నుంచి సాయినగర్ వరకు కొంత సిమెంట్ రోడ్డు, మరికొంత గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో కూడా రాత్రి సమయంలో 30 నుంచి 50 టన్నుల లారీలు ప్రయాణిస్తున్నాయి. ఆ రోడ్డులో కూడా డ్రైన్లతో పాటు సిమెంట్ రోడ్డు కూడా కొంతమేర దెబ్బతింది. ఉండవల్లి హరిజనవాడకు వెళ్లే కరకట్ట రోడ్డు టెన్‌టైర్ లారీ వెళ్లాలంటే చాలా కష్టతరం. కానీ మట్టి మాఫియా ఆ రోడ్డులో సైతం భారీ వాహనాలను నడుపుతున్నారు. ఉండవల్లి పంచాయతీగా ఉన్న సమయంలో ఆ రహదారిలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు.

ద్విచక్రవాహనాలకూ ఇబ్బందే..

కరకట్ట ప్రాంతం కావడంతో సిమెంట్‌రోడ్డు పగుళ్లు వచ్చి ద్విచక్రవాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. లారీల పుణ్యమా అంటూ అక్కడక్కడా సిమెంట్ రోడ్డు దెబ్బతిన్నట్లు ప్రయాణికులు తెలియజేశారు. కనీసం లారీ వెళ్లని ప్రాంతాల్లో కూడా మట్టి తోలకాలు నిర్వహిస్తూ లారీ యజమానులు జేబులు నింపుకొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్ అధికారులు మట్టి తవ్వకాలపై దృష్టి సారించి, రోడ్లు దెబ్బతినకుండా.. ఇరుకు రోడ్లలో లారీలు తిరగకుండా నిషేధించాలని కార్పొరేషన్‌లోని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇళ్లస్థలాల దరఖాస్తులు పరిశీలించాలి

సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పేదల ఇళ్లస్థలాల మంజూరు కోసం నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న వాటిని తక్షణమే పరిశీలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ డిమాండ్ చేశారు. చిర్రావూరులో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని విమర్శించారు. ఇల్లులేని పేదలందరికీ పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణం చేస్తామని ఎన్నికల ముందు మాట ఇచ్చిన నారా లోకేష్ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గమైన మంగళగిరికే ఇలా ఉంటే వేరే నియోజకవర్గాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు జారీ చేయాలని కోరారు. లేని పక్షంలో పేదప్రజలు ఐక్యమై పోరాటాలకు దిగుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పల్లెకృష్ణ, బొప్పన గోపాలరావు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న సిస్టర్ నిర్మలజ్యోతి

మంగళగిరి టౌన్: గతనెల 27, 28 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్-మెషిన్ లెర్నింగ్ ఇన్ ఫార్మాస్యూటికల్ అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో ఫార్మసీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో నిర్మల ఫార్మసీ కళాశాలతో పాటు యూనివర్సిటీలోని పలు ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులందరికీ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించగా తమ కళాశాలలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు లక్ష్మీనారాయణ, జస్వంత్‌లు ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతులు గెలుపొందారని వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు సదస్సుల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాములు రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ స్పందన, డాక్టర్ పి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రారంభోత్సవంలో పాల్గొన్న విశ్రాంత వెల్‌ఫేర్ అధికారి నాగరాజు

పిరంగిపురం: చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని విశ్రాంత వెల్‌ఫేర్ అధికారి డి.నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని పాత లైబ్రరీ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన డి.రామకోటయ్య చిన్నపిల్లల వైద్యశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. పేదవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రమాకాంత్, డాక్టర్ రమేష్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ తులసీకిరణ్, సుబ్బారాయుడు, శ్రీనిత, డాక్టర్ మానస, డాక్టర్ చిన్నమ్మాయి, నాయకులు ఎం.నరసింహరావు, హృదయరాజు, మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.ప్రవీణ్ రెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, పి.చిన్న, ఇజ్రాయిల్, ఇ.పూర్ణారెడ్డి, డి.నరేంద్రకుమార్, టి.కృష్ణ, భాజావలి, జాకీర్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛ మంగళగిరి 2.0పై ప్రజలకు అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, మణిపాల్ సెంటర్ ప్రాంతాల్లో సోమవారం స్వచ్ఛ మంగళగిరి 2.0పై ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో శుభ్రతపై శాశ్వత అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమని, ఎంటీఎంసీని రాష్ట్రంలోనే అత్యంత పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుదామని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ మంగళగిరి 2.0 అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంటరావు, ఎంటీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ కార్మికుల హామీని అమలు చేయాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు సాంబశివరావు, సుభాని, ఆదినారాయణ, అంకయ్యలతో కలిసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, మంత్రి లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ముసలా సాంబశివరావు, పిచ్చయ్య, గురవయ్య, ఆశీర్వాదం, అన్నమ్మ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. దీక్షలో శారమ్మ, అల్లం విజయశ్రీ, వేముల రిబ్కా, శారద, నవనీతమ్మ కూర్చున్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

పర్యటిస్తున్న మంత్రి నారాయణ

తాడికొండ: అమరావతిలోని నేలపాడులో నిర్మాణంలో ఉన్న భవనాలను మంత్రి నారాయణ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. గెజిటెడ్ అధికారుల కోసం నిర్మిస్తున్న టైప్-1, టైప్-2తో పాటు గ్రూప్-డీ ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న క్వార్టర్లను పరిశీలించి పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పర్యటన ముగిసిన తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో తన సొంత స్థలం కోల్పోయానని చెప్పారు. 2001లో రాష్ట్రం విడిపోకముందే విజయవాడ సమీపంలోని ఈడుపుగల్లులో తాను కొనుగోలు చేసిన 60 సెంట్ల స్థలం ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో ఉందన్నారు. ఇటీవల భవనం నిర్మాణం కోసం సీఆర్డీఏకు దరఖాస్తు చేసినప్పుడు తన స్థలం విషయం బయటపడిందన్నారు. మంత్రి వెంట సీఆర్డీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేఎల్‌యూలో ప్రారంభమైన సురభి-2026

చిత్రకళ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసరచన పోటీల్లో లిఖిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం సురభి 2026 సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురభి-2026 కన్వీనర్ పి.సాయివిజయ్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆయా కళాశాలల నుంచి విద్యార్థులు సుమారు 15 వేలకు పైగా పాల్గొంటున్నారని తెలిపారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా యువతీ, యువకులు సాంస్కృతికక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆటపాటలతో పాటు మాక్ పార్లమెంట్ లాంటి పలు రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. సాహిత్యం, చిత్రకళ వంటి రెండు ప్రధాన విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్న కథ రచన, వ్యాసరచన వంటి పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకత చాటుకున్నారని వివరించారు. చిత్రకళ విభాగంలో కూడా రెండు రకాల పోటీలు నిర్వహించామన్నారు. ల్యాండ్‌స్కేప్, భవిష్య భారతం వంటి అంశాల పైన విద్యార్థులు తమ చిత్రాల ద్వారా ప్రకృతి సౌందర్యాన్ని, భవిష్యత్ భారతదిశను సృజనాత్మకంగా ప్రతిబింబించారు. మొత్తం నాలుగు పోటీలలో ప్రతీ పోటీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్, సురభి-2026 చైర్మన్ డాక్టర్ కేఆర్ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాల్వలు నిర్మించాలని వినతి

తెనాలిఅర్బన్: 29వ వార్డు సుల్తానబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలోని రోడ్డు, కాల్వలు అధ్వానంగా ఉన్నాయని వాటిని నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అడుసుమల్లివారి వీధిలో అనధికార కట్టడాలు ఉన్నాయని, వాటి ని తొలగించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, డీఈ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థులకు పతకాలు

తెనాలి: గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫై తైక్వాండో చాంపియన్‌షిప్-2026లో తెనాలికి చెందిన హరిహంసిక డాన్స్ అండ్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో 15 బంగారు పతకాలు, 8 వెండి పతకాలను సాధించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.డీ నాసిర్ అహమ్మద్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, టీడీపీ సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన పార్టీ రాష్ట్ర సెక్రటరీ బి.శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రెసిడెంట్ గాదె వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వాహకులు పి.రాంబాబు, తైక్వాండో టోర్నమెంట్ ఇన్‌చార్జీలు ఎం.సత్యనారాయణ(చిన్నా మాస్టర్), కరుణాకర్, సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విజేతలను హరిహంసిక డాన్స్ అండ్ తైక్వాండో అకాడెమీ వ్యవస్థాపకులు మాస్టర్ చిన్న అభినందించారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో కేవీపీఎస్ జిల్లా నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్, బూరగ వెంకటేశ్వర్లు కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఈనెల 5వ తేదీన గుంటూరు యూటీఎఫ్ కార్యాలయంలో తలపెట్టిన సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. భారత రాజ్యాంగం ప్రకారం అనుచుఇత కులాల (ఎస్సీ) హోదా అనేది చారిత్రక సామాజిక వివక్షకు గురైన వారికి రక్షణ కవచం లాంటిదని తెలిపారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు మాత్రమే ఈ హోదాను పరిమితం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మతం మారినంత మాత్రాన దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, వెలివేత వంటి దుశ్చర్యలు నేటికీ కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. 5వ తేదీన జరిగే సెమినార్‌లో దళిత క్రైస్తవ సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బర్నబాస్, మేరి, నీరుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

కమిషనర్ అలీమ్‌బాషా

వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: ప్రజలు వారి నిత్యావసర వినియోగంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్లాస్టిక్‌ను నియంత్రించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేట, మండల పరిధిలోని కాజా గ్రామంలో సోమవారం స్వచ్ఛ మంగళగిరి 2.0 కార్యక్రమాన్ని ఎంటీఎంసీ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఎంటీఎంసీని పూర్తిస్థాయిలో స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలోని హైస్కూలు కళాశాలలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్టు పోలీసులు తెలిపారు. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. అనురాధ పర్యవేక్షించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com

బ్యాంక్ ఆఫ్ బరోడా | Bank of Baroda

కుంచనపల్లి బ్రాంచి
అరవింద స్కూల్ ప్రక్కన, కె.ఎల్.యు రోడ్డు, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఏపి-522501. ఫోన్: 8977513968.

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు అనుబంధం-IV-ఎ (రూల్ 8(6) & 9(1) చూడగలరు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

అధఃపతితులకు నిశ్చితము ప్రజలకు తెలియచేయునది మరియు ప్రత్యేకంగా బుజ్జగింపబడు(ణు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు మరియు తెలియచేయునది ఏమనగా: ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూరిటీ క్రెడిటర్ గారికి తనఖా / ఛార్జ్ చేయబడ్డ బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధికృత అధికారులచే (సెక్యూర్డ్ క్రెడిటర్) స్వాధీనము చేసుకోబడి ఈ దిగువ చెప్పబడిన భారీ(ణు) యొక్క మొత్తము తిరిగి వసూలు చేసినందుకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ